సాక్షి
రంగారెడ్డి
సోమవారం । 12 । జూన్ । 2023



శిఖం ఇక కనుమరుగేనా?

మాసబ్ చెరువు శిఖంలో డంప్ చేసిన మట్టి, బండరాళ్ల తొలగింపుపై అధికారులు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. 8లో▸



రిజర్వేషన్లు అమలు చేయాలి

హిందూ కులాల దళితులకు మాత్రమే ఎస్సీ రిజర్వేషన్ అమలు చేయాలని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. 8లో▸



15 మేక పిల్లలు మృతి

అనుమానాస్పద స్థితిలో మందలో ఉన్న 15 మేకపిల్లలు మృతి చెందాయి. ఈ ఘటన ఉప్పరిగూడలో చోటు చేసుకుంది. 8లో▸

న్యూస్‌రీల్

గురుకులాల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

మొయినాబాద్: సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 5వ తరగతిలో మొదటి లిస్టులో సీట్లు పొందిన విద్యార్థుల ప్రవేశాలకు ఈ నెల 15 వరకు గడువు పొడిగించినట్లు రంగారెడ్డి, హైదరాబాద్ ప్రాంతీయ సమన్వయాధికారి శారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమకు కేటాయించిన గురుకులాల్లో 15వ తేదీలోగా చేరాలని సూచించారు.

దోస్త్ హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం దోస్త్ హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆదివారం కళాశాల ప్రిన్సిపాల్ కమల పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకునేటప్పుడు సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం దోస్తు హెల్ప్ లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కేంద్రం కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఎస్.రవీందర్‌రెడ్డి నియమించినట్లు తెలిపారు. డిగ్రీ ప్రవేశాల కోసం ప్రయత్నించే విద్యార్థులు కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలు కల్పించినట్టు తెలిపారు.

పాలమూరును ముక్కలు చేసిన పాపం కేసీఆర్‌దే

పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రాఘవాచారి



మాట్లాడుతున్న రాఘవాచారి

షాద్‌నగర్: పాలమూరు జిల్లాను ముక్కలుగా చేసిన పాపం సీఎం కేసీఆర్‌దేనని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రాఘవాచారి అన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం షాద్‌నగర్‌లో చేపట్టిన రిలేనిరాహార దీక్షలు ఆదివారంతో ముగిసాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాఘవాచారి మాట్లాడుతూ.. వ్యూహాత్మకంగానే షాద్‌నగర్‌ను పాలమూరు నుంచి విడదీసి రంగారెడ్డి జిల్లాలో కలిపారని విమర్శించారు. చినజీయర్, జూపల్లి రామేశ్వర్‌రావుకు లబ్ధి చేకూర్చేందుకే కొంగరకొలాన్‌లో కలెక్టరేట్ నిర్మించారని ఆరోపించారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా జిల్లేడు చౌదరిగూడ మండలంలో నిర్మించ తలపెట్టిన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వలేదని అన్నారు. రిజర్వాయర్ నిర్మాణం పూర్తయ్యేంత వరకు పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్, వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇబ్రహీం, ఎస్.రాజు, దొడ్డి శ్రీనివాస్, తుప్పుడు నర్సయ్య, అర్జునప్ప, తిరుమలయ్య, టీజీ శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'పట్నంలో' తెలంగాణ రన్

ఇబ్రహీంపట్నం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాచకొండ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 6 గంటలకు ఇబ్రహీంపట్నంలో తెలంగాణ రన్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్ తెలిపారు. స్థానిక గురుకుల విద్యాపీఠ్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా మీదుగా బీడీఎల్ రోడ్డు వరకు ఈ రన్ సాగుతుందన్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నేతృత్వంలో కార్యక్రమం జరుగనున్నట్లు చెప్పారు.

నేడు చేవెళ్లలో 2కే రన్

చేవెళ్ల: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చేవెళ్లలో సోమవారం డివిజన్ స్థాయిలో 2కే రన్ నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ వేణుమాధవ్‌రావు తెలిపారు. ఉదయం 6 గంటలకు చేవెళ్ల పోలీస్‌స్టేషన్ నుంచి షాబాద్ చౌరస్తా వరకు 2కే రన్ ఉంటుందని చెప్పారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

22 నుంచి సీనియర్ బ్యాడ్మింటన్ పోటీలు

మలక్‌పేట: రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (ఎస్ఏటీఎస్) సంయుక్తాధ్వర్యంలో 9వ, యోనెక్స్ సన్‌రైజ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కరెడ్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 22 నుంచి 24 వరకు నందిగామ మండలం కన్హా శాంతి వనంలో జరుగుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు 98480 15443.

సమస్యలతో స్వాగతం

నేటి నుంచి విద్యా సంస్థలు పునఃప్రారంభం

- వేధిస్తున్న మౌలిక సదుపాయాల కొరత
- స్కావేంజర్లు లేక దుమ్ముపట్టిన తరగతి గదులు, బెంచీలు
- పూర్తి కాని 'మన ఊరు మనబడి' పనులు
- విద్యార్థులకు ఎప్పటిలాగే తప్పని తప్పలు



ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట పాఠశాలలో పూర్తికాని రంగులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఆదివారంతో వేసవి సెలవులు ముగిశాయి. సోమవారం నుంచి విద్యా సంస్థలు పునః ప్రారంభం కానున్నాయి. ఎప్పటిలాగే ఈ విద్యా సంవత్సరం కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు పలు సమస్యలు స్వాగతం పలకనున్నాయి. విద్యా వ్యవస్థను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం ఆశించిన స్థాయిలో చర్యలు చేపట్టకపోవడం, మన ఊరు-మనబడి పథకంలో భాగంగా చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయకపోవడమే ఇందుకు కారణం. తరగతి గదులు, ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్ వంటి కనీస మౌలిక సదుపాయాల కొరత వేధిస్తోంది. స్కావేంజర్లు కూడా లేకపోవడం సర్కారు బడుల పాలిట శాపంగా మారింది. రెండు నెలలుగా పాఠశాలలకు వేసవి సెలవులు కావడం.. తరగతి గదుల నిండా దుమ్ము, ధూళి పేరుకుపోవడం, క్రీడా ప్రాంగణాలు చెత్తాచెదారంతో నిండిపోవడం, వాటిని శుభ్రం చేసేందుకు స్థానిక సంస్థల సిబ్బంది ముందుకు రాకపోవడంతో ఆ బాధ్యతను కూడా ఉపాధ్యాయులు, విద్యార్థులే నిర్వర్తించాల్సి వస్తోంది. కొన్ని స్కూళ్లలో తాగునీటి ట్యాంకులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేసినా నీటి సదుపాయం లేకపోవడం ఇబ్బందిగా మారింది. మధ్యాహ్న భోజనం వంటకు తంటాలు తప్పడం లేదు.

పాఠ్యాంశాలు బోధించే గురువులేరీ?

విద్యార్థుల నిష్పత్తికి తగినంత మంది ఉపాధ్యాయులు లేకపోవడం, విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఇప్పటికీ ఖాళీలు భర్తీ చేయక పోవడం ఆందోళన కలిగిస్తోంది. మూడేళ్ల నుంచి వలంటీర్లను నియమించకపోవడంతో విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన కష్టంగా మారుతోంది. నాణ్యమైన బోధన లేకపోవడంతో ఉత్తీర్ణతశాతం తగ్గుతోంది.



మొయినాబాద్ మండలం మేడిపల్లి ఉన్నతపాఠశాలలో అసంపూర్తిగా వంటగది

మధ్యలోనే 'మనఊరు-మనబడి' పనులు

మన ఊరు- మనబడి పథకంలో భాగంగా మొదటి విడతగా రూ.97.91 కోట్ల అంచనా వ్యయంతో జిల్లాలో 464 స్కూళ్లను ఎంపిక చేశారు. వీటిలో ఇప్పటికే 54 పాఠశాలల్లో సివిల్స్ వర్క్స్ సహా కలర్లు, తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, వంటగది, డైనింగ్ హాల్, తరగతి గదులు, ఫ్యాన్లు, గ్రీన్ చాక్‌బోర్డులు, ప్రహరీల నిర్మాణం, శిథిలమైన గదుల స్థానంలో కొత్తవాటి నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనులు పూర్తయ్యాయి. ఆయా స్కూళ్లను ఇప్పటికే కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. మరో 180 స్కూళ్లలో పనులు తుది దశలో ఉన్నాయి. మిగిలిన చోట ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. క్షేత్రస్థాయి ఖర్చులకు ప్రభుత్వం చెల్లిస్తున్న బిల్లులకు పొంతన లేకపోవడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఫలితంగా ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా విద్యార్థులకు సమస్యలు తప్పేలా లేవు.

పిల్లలు బడిలో చేరేలా..

ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏటా బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి సోమవారం ఉదయం కందుకూరు జెడ్పీహెచ్ఎస్‌లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెలాఖరు వరకు ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు ఇంటింటికీ తిరిగి బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించనున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో అందిస్తున్న విద్య, మధ్యాహ్న భోజనం, ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం వంటి అంశాలపై కరపత్రాలు పంపిణీ చేసి విద్యార్థులను మరింతగా ఆకర్షించనున్నారు.

20న పుస్తకాలు, యూనిఫాం పంపిణీ

దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 20న నిర్వహించే విద్యా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలతో పాటు నోట్‌బుక్స్, రెండు జతల యూనిఫాంలు అందజేయనున్నారు. ఇప్పటికే జిల్లాకు 10,23,200 పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. 1,81,137 యూనిఫాంలు పంపిణీకి సిద్ధంగా ఉంచారు. 9,10వ తరగతికి చెందిన ఒక్కో విద్యార్థికి 12 నోట్ బుక్స్ చొప్పున 7,8 తరగతి విద్యార్థులకు 9 చొప్పున, ఆరో తరగతి విద్యార్థికి ఆరు చొప్పున నోటుబుక్స్ అందజేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్‌రావు ప్రకటించారు.

అభివృద్ధికి కేరాఫ్ బీఆర్ఎస్ ప్రభుత్వం



లక్ష్మీనగర్‌లో పార్కు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా తదితరులు

- మంత్రి సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సరూర్ నగర్ డివిజన్ పరిధి లక్ష్మీనగర కాలనీలో రూ.32 లక్షల నిధులతో చేపట్టిన పార్కు నిర్మాణ పనులకు ఆదివారం ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తాతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో మంత్రి కేటీఆర్ ఆలోచనలతో గ్రేటర్ హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా మారుతోందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా మారిందో చూడాలన్నారు. తెలంగాణ పదేళ్ల పండుగలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు కొత్తపేట చౌరస్తా నుంచి లక్ష్మీనగర్ వరకు పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అనిత, పార్టీ డివిజన్ అధ్యక్షుడు మహేందర్ యాదవ్, సీనియర్ నాయకులు బేర బాలకిషన్, అరవింద్‌శర్మ, నగేష్, కొండల్‌రెడ్డి, ముద్దా పవన్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

తుక్కుగూడ: ప్రజా సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కేంద్రంలోని 13,14,15 వార్డుల్లో ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో తుక్కుగూడ ఊహించని విధంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతం ఫ్యాబ్‌సిటీ, ఈ-సిటీ, ఫార్మాసిటీ రాకతో ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. ప్రభుత్వం ఎయిర్‌పోర్టు వరకు ఏర్పాటు చేసే మెట్రో రైలును ఇక్కడి వరకు పొడిగించాలని సీఎం కేసీఆర్‌ను కోరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రాం, డీఈఈ యాదయ్య, వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు సప్పిడి లావణ్య, రవినాయక్, సుమన్, రాజు, తేజస్విని, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ

- అదనపు కలెక్టర్ తిరుపతిరావు

ఇబ్రహీంపట్నం రూరల్: సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని అదనపు కలెక్టర్ తిరుపతిరావు పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కలెక్టరేట్‌లో కవి సమ్మేళనం నిర్వహించారు. 48 మంది కవులను సన్మానించి ప్రశంసా పత్రాలతో పాటు రూ.1,116 నగదు అందజేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాహితీ దినోత్సవాన్ని నిర్వహించుకోవడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్, డిప్యూటీ సీఈఓ రంగారావు, కేశంపేట జెడ్పీటీసీ విశాల, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ వెంకటాచారి, జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కవులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ తిరుపతిరావు తదితరులు

కేంద్ర పథకాల పనుల్లో నిర్లక్ష్యం తగదు

- కేంద్ర భారీ పరిశ్రమల శాఖమంత్రి మహేంద్రనాథ్ పాండే


ఆమనగల్లు: కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో చేపడుతున్న పనుల్లో నిర్లక్ష్యం తగదని కేంద్ర భారీ పరిశ్రమల శాఖామంత్రి మహేంద్రనాథ్ పాండే అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. మండలంలోని మేడిగడ్డ తండాలో ఆదివారం జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సుధాకర్‌రావ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కండె హరిప్రసాద్‌తోకలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మేడిగడ్డతండా నుంచి శంకరకొండతండా రోడ్డులో కత్వ వాగుపై ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద మంజూరైన రూ.3.10 కోట్లతో చేపడుతున్న వంతెన నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. వాగుపై వంతెన లేక ఇబ్బందులు పడుతున్నామని, బ్రిడ్జి పనులను త్వరగా పూర్తిచేయాలని మేడిగడ్డతండా సర్పంచ్ అమర్‌సింగ్, పలువురు గిరిజనులు కోరారు. బ్రిడ్జి పనులకు నిధులు మంజూరై టెండర్ పూర్తయి ఏడాదైనా పనుల్లో పురోగతి లేకపోవడంపై కేంద్రమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు ఎందుకు జరగడం లేదని పంచాయతీరాజ్ ఏఈఈలు కృష్ణయ్య, అభిషేక్‌ను ప్రశ్నించగా పనులు ప్రారంభించాక పిల్లర్ గుంతల్లోకి నీరు రావడంతో ముందుకు సాగలేదని వారు వివరించారు. దేశంలో పెద్ద పెద్ద నదులపై వంతెనలు నిర్మిస్తుండగా చిన్న వాగుపై వంతెన నిర్మాణానికి నీళ్లు అడ్డువస్తాయా అని మంత్రి ప్రశ్నించారు. వెంటనే పనులను ప్రారంభించి పూర్తి చేయాలని నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోందని చెప్పారు. తెలంగాణాలో బీజేపీ అధికారంలోకి రావడానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కమలేశ్, నర్సింహ, శ్రీకాంత్‌సింగ్, లక్ష్మణ్‌రావ్, శ్రీశైలం యాదవ్, రాజశేఖర్, పురుషోత్తం, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మేడిగడ్డతండాలో గిరిజనులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి మహేంద్రనాథ్ పాండే

59.15 శాతం హాజరు

- ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష



గ్రూప్-1పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసేందుకు వచ్చిన కలెక్టర్ హరీశ్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. అబ్దుల్లాపూర్‌మెట్ బ్రిలియంట్ ఇంజినీరింగ్ కళాశాల, పల్లవి ఇంజినీరింగ్ కళాశాల, వనస్థలిపురం ఎస్‌కేడీనగర్‌లోని డీపీఎస్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ హరీశ్ ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించడంతో పాటు అభ్యర్థుల హాజరు గురించి అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా.. లేదా అనే విషయాన్ని సీసీ కెమెరా ఫుటేజీల ద్వారా పరిశీలించారు. అనంతరం ఆయా కేంద్రాల్లో బయోమెట్రిక్ ద్వారా జరిపిన వేలిముద్రల సేకరణ ప్రక్రియ గురించి ఆరా తీశారు. కేంద్రాల్లోని గదులను సందర్శించి సదుపాయాలు ఉన్నాయా లేవా అని తెలుసుకుని సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 55,032 మంది అభ్యర్థులకు గాను 32,553 మంది పరీక్షకు హాజరయ్యారని, 22,479 మంది గైర్హాజరయ్యారని, మొత్తంగా 59.15 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీటి వసతి, కేంద్రంలోకి సెల్‌ఫోన్లు,ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి లేనందున అభ్యర్థులను మెటల్ డిటెక్టర్లతో క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించారు.

ఆ ప్రచారం అవాస్తవం

బాలాపూర్ చౌరస్తాలోని చైతన్య కాలేజీ పరీక్షా కేంద్రంలో అరగంట ముందే అభ్యర్థుల నుంచి ఓఎంఆర్ షీట్లను తీసుకున్నారని సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని కలెక్టర్ హరీశ్ స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న ఇన్విజిలేటర్ పరీక్ష సమయం ముగియడానికి అరగంట మిగిలి ఉందని అభ్యర్థులను అప్రమత్తం చేశారు తప్ప, ముందుగానే ఓఎంఆర్ షీట్లను తీసుకోలేదని కలెక్టర్ తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తూ అభ్యర్థులు, ప్రజలను గందరగోళానికి గురిచేయడం తగదని హితవు పలికారు.

పరీక్షకు వెళ్లిన తల్లి.. పాపను లాలించిన మహిళా కానిస్టేబుల్



పసిపాపతో కానిస్టేబుల్ కవిత

చేవెళ్ల: మండల కేంద్రంలోని సిల్వర్‌డేల్ పరీక్ష కేంద్రంలో లంగరహౌస్‌కు చెందిన జ్యోతి తన మూడు నెలల పాపతో వచ్చింది. వెంట భర్త లింగస్వామి వచ్చాడు. భార్య పరీక్ష కేంద్రంలోకి వెళ్లగా బయట లింగస్వామి పసిపాపతో ఉండిపోయాడు. కాసేపు పాప బాగానే ఉన్నా తరువాత ఏడవడం ప్రారంభించింది. పాపను లాలించేందుకు తండ్రి లింగస్వామి అనేక ప్రయత్నాలు చేశాడు. ఇదంతా అక్కడే విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ కవిత గమనించింది. చలించిపోయిన ఆమె పాపను తీసుకొని తన ఒడిలో పెట్టుకొని లాలించింది. పాప ఏడుపు మానిన తరువాత తండ్రికి అప్పగించింది.

శిఖం ఇక కనుమరుగేనా?

మాసబ్ చెరువుపై నిర్లక్ష్యం
- మట్టి, బండరాళ్ల తొలగింపులో తీవ్ర జాప్యం
- అక్రమార్కులకు అధికారుల అండదండలే కారణం



నక్ష బాట పేరుతో డంప్ చేసిన బండరాళ్లు, మట్టి



చెరువులో డంప్ చేసిన మట్టి బండరాళ్లు

తుర్కయంజాల్: మాసబ్ చెరువు శిఖంలో డంప్ చేసిన మట్టి, పెద్ద పెద్ద బండరాళ్లను తొలగించే విషయంలో ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నామ్‌కేవాస్తేగా నాలుగు ట్రాక్టర్ల మట్టిని తొలగించి చేతులు దులుపుకొన్నారన్న ప్రచారం జరుగుతోంది. చెరువు పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున ఉద్యమం కొనసాగుతున్నా అధికారుల్లో ఏ మాత్రం చలనం లేకపోవడం చూస్తుంటే అక్రమార్కులకు అండగా ఉంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో చెరువు శిఖం మాయం చేసేందుకే పెద్ద కుట్ర జరుగుతోందని సర్వత్రా చర్చ జరుగుతోంది.

తొలగింపులో కాలయాపన..

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ హయత్‌నగర్ సర్వే నంబర్ 159లో నూతనంగా నిర్మించనున్న కార్యాలయ భవన నిర్మాణ పనులకు 500 టిప్పర్ల మొరం కావాలని గతంలో రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ముందుగా సంఘీనగర్‌లోని సర్వే నంబర్లు 275, 297ల నుంచి మొరం మట్టి తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. కానీ మాసబ్ చెరువు శిఖం సర్వే నంబర్ 137లో డంప్ చేసిన మట్టిని నేరుగా ఎక్సైజ్ శాఖ భవన నిర్మాణానికి తరలించాలని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ అనితా రెడ్డి కోరారు. దీనికి వారు ముందుగా సానుకూలంగా స్పందించినా ఆ తరువాత పెద్ద పెద్ద బండరాళ్లే అధికంగా ఉండటంతో ఈ బండరాళ్లు మాకు వద్దని వెనక్కి తగ్గినట్లు సమాచారం. ఖర్చు లేకుండా డంప్ చేసిన మట్టిని తొలగించాలని అధికారులు ప్లాన్ చేసినప్పటికీ అది ఫలించలేదు. ప్రత్యామ్నాయ మార్గాలను వెతికి చెరువు శిఖాన్ని కాపాడాల్సిన అధికారులు ఆ పనిని పూర్తిగా పక్కన పడేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

సమన్వయ లోపం..

ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపం మాసబ్ చెరువు పాలిట శాపంగా మారింది. వారసత్వ సంపదగా వస్తున్న చెరువును కాపాడటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎవరైనా సామాన్యులు ఫిర్యాదు చేసినా, వివరాలు అడిగిన వారిపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప నేటికి ఎలాంటి కార్యాచరణ రూపొందించలేదు. మే నెల 21న మట్టి, బండరాళ్లు డంప్ చేసిన వారిపై మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, 23న నాలుగు ట్రాక్టర్ల మట్టి తీయించిన అధికారులు ఆ తరువాత పట్టించుకోవడంలేద.

రాజకీయ ఒత్తిళ్లు..

రైతుల ముసుగులో ఉన్న కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇప్పటికే అధికార పార్టీ పెద్దలను సంప్రదించినట్లు సమాచారం. తమ పొలాలకు వెళ్లడానికి బాటలేదని కారణాలను చెబుతూ తప్పించుకోవడానికి ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. డంప్ చేసిన మట్టిని మొత్తం అలానే ఉంచి రోడ్డుగా ఉపయోగించాలనే వ్యూహం పన్నుతున్నారని, ఇప్పటికే అధికారులకు ఆ దిశగా అనధికారిక ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. అందువల్లే అధికారులు శిఖం భూమిలో మట్టి, బండరాళ్లను డంప్ చేసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆ బాధ్యత రెవెన్యూ వారిదే

చెరువు శిఖంలోని 137 సర్వే నంబర్ ప్రభుత్వ భూమి కనుక పూర్తి బాధ్యత రెవెన్యూ అధికారులదే నని ఇరిగేషన్ డీఈఈ ఉషారాణి అన్నారు. వారే మట్టిని తొలగించడానికి ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఇరిగేషన్ శాఖ వారికి లేఖలు రాశామన్నారు. ఎందుకు సమన్వయంతో పని చేసి చెరువును కాపాడటం లేదన్న ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వకపోవడం గమనార్హం

తొలగించడం ఖర్చుతోకూడుకున్న పని

చెరువులో డంప్ చేసిన మట్టి, బండరాళ్లను తొలగించడం ఖర్చుతో కూడుకున్న పని అని అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి అన్నారు. ఇరిగేషన్ అధికారులు చెరువు చుట్టు పక్కల చాలా మందికి ఇప్పటికే ఎన్‌ఓసీలను జారీచేసిన విషయం తెలిసిందే. వాళ్లు పూర్తి వివరాలతో మమ్ముల్ని సంప్రదించం లేదు. ఇరిగేషన్ అధికారులు ముందుకు రాకపోవడం వల్ల సరి అయిన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నాం. మున్సిపల్ అధికారుల నుంచికూడప్రోత్సాహం కరువైంది.

గ్రామాల్లో దర్జాగా భూకబ్జాలు

- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్ ధ్వజం
- ఘాంసిమియాగూడ రైతులకు సంఘీభావం



రైతులకు సంఘీభావం తెలుపుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

శంషాబాద్ రూరల్: తెలంగాణలోని వేలాది గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం భూకబ్జాలకు పాల్పడుతోందని, లేదంటే ప్రజల పట్టా భూములను ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడుతుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. మండలంలోని ఘాంసిమియాగూడ భూముల బాధిత రైతులకు అండగా ఆయన ఆదివారం గ్రామంలోని భూములను సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో పేద ప్రజల నుంచి దౌర్జన్యంగా తీసుకున్న భూములను తిరిగి వారికి అప్పగించేందుకు బీఎస్పీ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఏ భూమి మీద హక్కు కోసం తెలంగాణ తెచ్చుకున్నామో ఆ భూములిప్పుడు రైతుల వద్ద లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఘాంసిమియాగూడలో వందేళ్ల నుంచి సాగు చేసుకుంటున్న 90 మంది రైతులకు సంబంధించిన సుమారు 200 ఎకరాల భూములను గోల్డ్‌స్టోన్ కంపెనీ యజమాని ప్రసాద్ అన్యాయంగా లాక్కున్నారని ఆరోపించారు. మియాపూర్ భూముల కుంభకోణంలో వందల ఎకరాల ప్రభుత్వ భూములను అక్రమంగా కొట్టేసిన గోల్డ్‌స్టోన్ ప్రసాద్ ఘాంసిమియాగూడ రైతులను కూడా మోసం చేస్తున్నారన్నారు. బీసీ వర్గానికి చెందినవాడినని చెప్పుకుంటున్న స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ రైతుల పక్షాన ఉండి పోరాడాలా..లేదంటే గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌కు మద్దతివ్వాలా అని ప్రశ్నించారు. ఘాంసిమియాగూడ పేద రైతులకు బీఎస్పీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

హిందూ కులాల దళితులకే రిజర్వేషన్లు అమలు చేయాలి

ఆమనగల్లు: హిందూ కులాల దళితులకు మాత్రమే ఎస్సీ రిజర్వేషన్ అమలు చేయాలని పలువురు దళిత సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మారెడు మోహన్, ఏబీవీపీ జాతీయ మాజీ అధ్యక్షుడు మురళీమనోహర్, జాతీయ కోశాధికారి బాల్‌రాం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల నర్సింహులు హాజరయ్యారు. సమితి జిల్లా అధ్యక్షుడు జునుకుంట్ల భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఎస్సీ రిజర్వేషన్లపై వివిధ దళిత సంఘాలు, ప్రజాసంఘాలు, హిందూ సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. మతం మారిన దళితులకు, ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వాలా? వద్దా? అనే విషయంపై కేంద్రం.. బాలకిషన్ కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమిషన్ ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా పాత రిజర్వేషన్ విధానాలను కొనసాగించేలా నివేదిక ఇవ్వాలని పలువురు అభిప్రాయపడ్డారు. కులంలేని మతాలలోకి మారిన వారు కులాధారమైన రిజర్వేషన్లు తమకు కావాలని అడగడం చట్ట విరుద్ధమని వారు అన్నారు. కుల వ్యవస్థను దూరం చేసుకుని జరుగుతున్న మత మార్పిడీలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రయాన్ని వ్యక్తం చేశారు. సమావేశంలో వివిధ దళిత, ప్రజా, హిందూ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మారెడు మోహన్

పిడుగుపాటుకు గేదె మృతి



మృతిచెందిన గేదె వద్ద బాధితుడు

ఆమనగల్లు: మండల పరిధిలోని రాంనుంతల గ్రామం పెద్ద తండాలో పిడుగుపాటుకు గేదె మృతిచెందింది. జాన్యకు చెందిన గేదెను సమీపంలోని పొలం వద్ద చెట్టుకు కట్టి ఉంచిన సమయంలో ఆదివారం సాయంత్రం పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ దాదాపు రూ.90 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. సర్పంచ్ సోన శ్రీనునాయక్ సందర్శించి బాధిత రైతు జాన్యను ఓదార్చారు. ప్రభుత్వపరంగా సాయం అందేలాచూస్తామని భరోసా ఇచ్చారు.

15 మేక పిల్లలు మృతి

ఉప్పరిగూడలో ఘటన



పరిశీలిస్తున్న సర్పంచ్, అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: అనుమానాస్పద స్థితిలో మందలో ఉన్న 15 మేకపిల్లలు మృతి చెందాయి. ఈ ఘటన ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడలో ఆదివారం చోటు చేసుకుంది. మడుపు యాదయ్య వ్యవసాయ బావి వద్ద మేకల మంద ఉంచారు. ఆదివారం ఉదయం వెళ్లి చూసే సరికి 15 మేక పిల్లలు మృతి చెంది ఉన్నాయి. వెంటనే స్థానిక సర్పంచ్‌రాంరెడ్డికి తెలిపడంతో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పశుసంవర్ధక శాఖ అధికారులు సైతం వచ్చి ఆరా తీశారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి ఫోన్‌చేసి విషయ చెప్పగా బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారి సురేందర్, ఉప సర్పంచ్ నర్సింహారెడ్డి, కోఅప్షన్‌సభ్యులు సురేందర్‌రెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం: స్థానిక పెద్ద చెరువులో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం వెలుగుచూసింది. స్థానిక ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం అంబేద్కర్ నగర్‌కు చెందిన యంజాల స్వామి(45) శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఆదివారం సాయంత్రం పెద్ద చెరువులో శవమై తేలాడు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సివుంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొల్లగొట్టింది రూ.35 కోట్లు.. రికవరీ రూ.కోటి!



- సిటీ సైబర్ క్రైంలో రికవరీ పరిస్థితి ఇదీ
- నిత్యం రూ.లక్షల్లో పోగొట్టుకుంటున్న బాధితులు
- పెరిగిన ఫిర్యాదుల తాకిడి
- రికవరీలో పోలీసులకు పలు సవాళ్లు
- నేరస్తులు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కావడంతో సమస్య

హిమాయత్‌నగర్: గ్రేటర్ పరిధిలో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. నిత్యం ఏదో ఒకచోట సైబర్‌నేరగాళ్ల బారిన పడి నగరవాసులు రూ.లక్షల్లో నష్టపోతున్నారు. ఏటా కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నా...సైబర్ నేరాల్లో రికవరీ మాత్రం చాలా తక్కువగా ఉంటోంది. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఒకర్ని ఇన్వెస్ట్‌మెంట్ రూపంలో, మరొకర్ని క్రిప్టో కరెన్సీ రూపంలో, ఇంకొకర్ని పార్ట్‌టైం జాబ్ రూపంలో కోటీశ్వరుల్ని చేస్తామంటూ నేరగాళ్లు వారిని గుల్ల చేస్తున్నారు. హైదరాబాద్ సిటీ సైబర్‌క్రైం పోలీసు స్టేషన్‌లో దాదాపు 1500 ఎఫ్ఐఆర్‌లు నమోదవగా రూ.35 కోట్లకు పైగా సొమ్ము లూటీ అయినట్లు పోలీసులు చెబుతున్నారు. వాటి రికవరీ విషయంలో పోలీసులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఇదే సమయంలో సైబర్ నేరాలకు పాల్పడుతున్నది ఇతర రాష్ట్రాల వారు కాబట్టి రికవరీ కష్టమేనంటూ బాధితుల ముఖంపైనే కొందరు ఐఓలు చెప్పడం ఇక్కడ గమనార్హం.

కష్టతరంగా రికవరీ

- రాజస్థాన్, బిహార్, ఢిల్లీ, యూపీ వంటి ప్రాంతాలకు చెందిన కొందరు నేరగాళ్లు నగరవాసులకు గాలం వేస్తున్నారు.
- ఇన్వెస్ట్‌మెంట్, క్రిప్టో కరెన్సీ, పార్ట్‌టైం జాబ్ తదితర సాకులు చెప్పి కోటీశ్వరుల్ని చేస్తామంటూ నమ్మిస్తున్నారు.
- టెలిగ్రామ్, వాట్సప్, ఇతర సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా పరిచయాలను పెంచుకుంటున్నారు. తొలిరోజుల్లో తక్కువ సొమ్ముకు ఎక్కువ రాబడిని ఇస్తూ నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నారు.
- ఆ తర్వాత లక్షల రూపాయలు కాజేస్తూ అమాయకుల్ని అప్పుల పాలు చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు హైదరాబాద్ సిటీ సైబర్‌క్రైంలో నమోదైన ఎఫ్ఐఆర్‌ల సంఖ్య 1500.
- దీనిలో అమాయకులు పోగొట్టుకున్నది రూ.35 కోట్లకు పైమాటే.
- దీనిలో పోలీసులు రికవరీ చేసింది మాత్రం రూ.కోటి కూడా ఉండకపోవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పోలీసులకు ఇబ్బందులు

సైబర్ నేరగాళ్ల బారిన పడ్డ నగర వాసులు డబ్బును కోల్పోయి సైబర్‌క్రైం పోలీసుల్ని ఆశ్రయిస్తున్నారు. రికవరీ విషయంలో పోలీసులు ఎంత కష్టపడ్డప్పటికీ టార్గెట్‌ను రీచ్ కాలేకపోతున్నారు. సైబర్ నేరాలకు పాల్పడుతున్న నేరస్తులంతా కూడా బ్యాంకు ఖాతాలు, ఫోన్ నెంబర్‌లు ఇతరులవి వినియోగిస్తున్నారు. ఇక్కడ ఎఫ్ఐఆర్ నమోదు అయ్యాక సంబంధిత బ్యాంకు కేవైసీ ఆధారంగా ఇతర రాష్ట్రాలకు వెళ్తున్న పోలీసులకు పరాజయాలు ఎదురవుతున్నాయి. అసలైన నేరస్తులు ఆయా అడ్రస్‌లలో ఉండకపోవడంతో వీరు వెనుదిరిగి రావాల్సిన పరిస్థితి వస్తోంది. ఒకవేళ ఒకరిద్దరు పోలీసులకు పట్టుబడినప్పటికీ రికవరీ మాత్రం ఆశించిన స్థాయిలో జరగడం లేదు. అప్పటికే డబ్బును ఖర్చు చేయడం, ఇతర దేశాలకు పంపడం లాంటి పనులు చేస్తున్నారు. దీంతో సైబర్‌క్రైంలో నమోదైన కేసుల రికవరీ విషయంలో పోలీసులకు చుక్కలు కనిపిస్తున్నాయి.

క్రిప్టో ద్వారా సొమ్మంతా విదేశాలకు



మనవారి వద్ద దోచుకున్న సొమ్మంతా కూడా క్రిప్టో ద్వారా విదేశాలకు వెళ్లిపోతుంది. బాధితులు మా వద్దకు వచ్చి మేం ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ఇతర రాష్ట్రానికి వెళ్లే లోపు ఆ డబ్బును తరలించేస్తున్నారు. ఈ కారణంగా రికవరీ చేయడం పెద్ద టాస్క్‌గా మారింది. అయినప్పటికీ ప్రతి కేసు విషయంలో మేము పకడ్బందీగా వ్యవహరిస్తున్నాం. బాధితులకు అండగా నిలిచేందుకు కృషి చేస్తున్నాం.

– కేవీఎం ప్రసాద్, సిటీ సైబర్‌క్రైం ఏసీపీ

నకిలీ ఐస్‌క్రీం తయారీ కేంద్రంపై దాడి

చైతన్యపురి: నకిలీ ఐస్‌క్రీం తయారు చేస్తున్న ఓ ఇంటిపై ఎల్‌బీనగర్ ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గడ్డిఅన్నారం డివిజన్ కోదండరాంనగర్ కాలనీలోని ఓ ఇంట్లో ఎటువంటి అనుమతులు లేకుండా ఐస్ క్యూబ్ పేరుతో ఐస్‌క్రీం తయారు చేస్తునట్లు సమాచారం అందింది. దీంతో ఎస్ఓటీ పోలీసులు ఆదివారం రాత్రి ఆ ఇంటిపై దాడి చేశారు. నిర్వాహకుడు భిక్షపతిని అదుపులోకి తీసుకున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో, కాలపరిమితి తీరిన ఫ్లేవర్స్‌తో ఐస్‌క్రీం తయారు చేస్తున్నట్లు గుర్తించారు. అలాగే యూనిట్‌కు ఎలాంటి అనుమతులు కూడా లేనట్లు విచారణలో తేలింది. భారీ ఎత్తున కాలం చెల్లిన ఫ్లేవర్స్, ఇతర ముడిసరుకుని స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం సరూర్‌నగర్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన నాట్యప్రదర్శనలు



మాదాపూర్‌లోని శిల్పారామంలో భరత నాట్య ప్రదర్శన

గచ్చిబౌలి: మాదాపూర్‌లోని శిల్పారామంలో నాట్య ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా అలరించాయి. వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 'శ్రీకృష్ణ కళ లయ' బెంగళూరు గురువు సునీతా సుకుమారన్ శిష్యబృందంచే నిర్వహించిన భరత నాట్య ప్రదర్శన ఆద్యంతం కట్టిపడేసింది. పుష్పాంజలి, గణేశకీర్తన, నాతనం మనోహర, పాహిమాం, నటేశకౌతం, త్రిమాత, వర్ణం, థిల్లాన తదితర అంశాలను నాట్య కళాకారులు చైత్ర కీర్తన, మోహిత, పంచమి, బృంద, తనూష, మేఘన, నవ్యశ్రీ, విద్య, దిశా, భూమిక, నిసర్గ, శ్రేయలు అద్భుతంగా ప్రదర్శించారు.